# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :248 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 12-12-2025 | పేజీలు:4 వెల: 2.00


### పరకామణి చోరీ కేసులో చట్టప్రకారం చర్యలు

అమరావతి, తిరుమల పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చోరీ కేసులో ఎన్వీఆర్ నమోదు చేసి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొనేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు కల్పించింది. చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంతో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు కొనసాగించాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు సేకరించిన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది. టీటీడీ అప్పటి ఏవీఎస్వో వై. సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికేట్‌ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారాన్ని అవసరమైన మేరకు ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పంచుకోవాలని స్పష్టీకరించింది. సీఐడీ, ఏసీబీ డీజీలు దాఖలు చేసిన నివేదికలను పరిశీలించిన అనంతరం హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం ఈనెల 16కు వాయిదా వేసింది.

## అధికార కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌యే టార్గెట్టా?



హైదరాబాద్, అక్క మొదట అలిగినట్లు చేసింది. ఆ తర్వాత రచ్చకెక్కింది. అట్టముక్కతో కొట్టినట్లు చేసి..ఇప్పుడు ఏకంగా బడిత పూజ మొదలు పెడుతోంది. భారీ డైలాగులు పేల్చుతూ ఎవరి గుండెల్లో గునపం దింపాలో దింపేస్తోంది. బీఆర్ఎస్ లీడర్లను టార్గెట్ చేస్తూ గులాబీ దళంలో గుబులు పుట్టిస్తోంది. ఇక చూసి చూసి భరించలేక.. కారు పార్టీ లీడర్లు కూడా ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే అంటున్నారు. పెద్ద సార్ కూతురని కూడా చూడకుండా నీ వల్లే పార్టీ పుట్టి మునిగిందని రివర్స్ అటాక్ చేస్తున్నారు. కారు వర్సెస్ కవిత ఫైట్ ఎటు వెళ్తోంది? జాగృతి టార్గెట్ బీఆర్ఎస్సేనా? ఇక బీఆర్ఎస్‌కూ జాగృతే టార్గెట్‌గా మారిందా..?నాన్న దేవుడు. అన్నతో నో ఇష్యూస్.. హరీష్ తోనే అసలు సమస్య అంటూ మొదట్లో ప్రకటన చేసింది. ఆ తర్వాత కొద్దిరోజులు సైలెంట్ గా ఉన్న కవిత ప్పుడు జనం బాటలో తన గేర్ మార్చేస్తుంది. రోజురోజుకూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను టార్గెట్ చేస్తూ హీట్ పుటిస్తోంది. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటన చేస్తున్న కవిత..ఎక్కడికి వెళ్లినా పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతిమయం, అసలు అభివృద్ధి ఏం జరిగింది అనేలా మాట్లాడుతూ వస్తున్నారు.మొన్నటి వరకు సుతిమెత్తంగా, సున్నితంగా విమర్శిస్తూ వచ్చిన కవిత..ఇప్పుడు ఏకంగా ఒక్కో ఎమ్మెల్యేను, మాజీమంత్రిని పర్సనల్ గా టార్గెట్ చేస్తూ అవినీతి ఆరోపణలు.. కబ్జాలు అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. చివరకు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గానికి వెళ్లి కూడా బీఆర్ఎస్ లీడర్లను టార్గెట్ చేస్తుండటం చర్చకు దారితీస్తోంది.

ఇదంతా గమనించిన గులాబీ లీడర్లు..కవిత బీఆర్ఎస్ నే టార్గెట్ చేస్తుందని తమపై చేస్తున్న వ్యాఖ్యలకు సైలెంట్ గా ఉంటే ఇంకా వీక్ అయిపోతామనే నిర్ణయానికి వచ్చారట. ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అవినీతి చేశారంటూ..ఇండైరెక్టగా గత బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయమే అనేలా కవిత ఆరోపిస్తుండటం గులాబీ లీడర్లకు అస్సలు మింగుడు పడటం లేదట. దీంతో కవిత వ్యాఖ్యలకు అంతే స్థాయిలో రియాక్ట్ అవ్వాలని డిసైడ్ అవ్వడమే కాదు.. డైరెక్ట్ ఎటాక్ కు దిగారు.

**తగ్గేదేలే అంటున్న బీఆర్ఎస్ నేతలు.. ఎదురు దాడి..**

కవిత తను పర్యటిస్తున్న నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా%ా%వారిని పల్లెత్తు మాట అనకుండా తమపైనే విరుచుకుపడటం బీఆర్ఎ నేతలకు మింగుడు పడటం లేదు. మొన్నటివరకు కవితపై బీఆర్ఎస్ నేతలు ఆచితూచి అడుగులు వేశారు. ఎంతైనా తమ అధినేత కూతురు కాబట్టి సంయమనంతో వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు కవిత డోస్ పెంచి వాయిస్ రేజ్ చేస్తుండటంతో బీఆర్ఎస్ లీడర్లు కూడా తగ్గేదేలే అంటున్నారు. మొన్న మాజీమంత్రి జగదీష్ రెడ్డి, ఆ తర్వాత మరో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కవిత ఆరోపణలపై తీవ్రస్థాయిలో ఫైర్ అవ్వగా.. ఇప్పుడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కవితకు లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చిపడేశారు. కవిత ఏ కేసులో జైలుకు వెళ్లారో మరిచిపోయి ఇలా తమను విమర్శించడం ఏంటని డైరెక్ట్ అటాక్ కు దిగుతున్నారు.

**గుట్టు విప్పుతానంటూ కవితకు సీరియస్ వార్నింగ్..**

తనపై కవిత ఆరోపణలు చేయడంతో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కవిత చరిత్ర ఏంటో తనకు బాగా తెలుసన్న ఆయన.. ఇంకా ఎక్కువ మాట్లాడితే గుట్టు విప్పుతానంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చి పడేశారు. కవిత పెంపుడు కుక్కకు విస్కీ అని పేరు పెట్టుకున్న కవిత.. పదేళ్లలో ఏమేం చేసిందో అంతా తెలుసంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అయితే కవిత బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసినా..గులాబీ లీడర్లు కవితకు కౌంటర్ గా మాట్లాడినా..నువ్వు అవినీతి చేశావంటే నువ్వు దోచుకున్నావంటూ ఆరోపణలు గుప్పించుకోవడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ఈ రెండు వర్గాలు కేసీఆర్ హయాంలో నిర్ణయాలపైనే అలిగేషన్స్ చేసుకుంటుడంతో..ఇండైరెక్ట్ గా గులాబీ బాస్ కు తలనొప్పిగా మారిందన్న టాక్ నడుస్తోంది.

## ఇద్దరు ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టు నోటీసులు..

హైదరాబాద్, డిసెంబర్ 11: ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వలేదంటూ దాఖలైన పిటిషన్‌పై ఇద్దరు ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది.కోర్టు ఆదేశాలు ఉన్నా ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేయలేదని మాజీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆర్టీఐ చట్టం ప్రకారం పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో గతంలో సికింద్రాబాద్‌లోని రాంగోపాల్‌పేటకు చెందిన వడ్డం శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు.దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంటనే అడిగిన సమాచారం ఇవ్వాలని నవంబర్ 24న ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని శ్యామ్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈరోజు (గురువారం) విచారణ జరిపిన ధర్మాసనం.. ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలని ఐఏఎస్ అధికారులపై మండిపడింది. కోర్టు ఆదేశాలు ఎందుకు పాటించలేదో




వివరిస్తూ జనవరి 26న కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా కోర్ట్ ఉత్తర్వులు పాటించకపోతే జరిమానా విధిస్తామని ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ధర్మాసనం హెచ్చరికలు జారీ చేసింది.

## ఇథనాల్ కలిసిన పెట్రోల్ పర్యావరణహితం..



న్యూఢిల్లీ: కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి గడ్కరీఇవాళ లోక్‌సభలో ఇథనాల్ గురించి కీలక ప్రకటన చేశారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్.. రైతులకు లాభదాయకంగా ఉన్నట్లు చెప్పారు. దీని వల్ల సుమారు 1.40 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయినట్లు ఆయన తెలిపారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్ పట్ల ఆందోళనలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో కేంద్ర రోడ్డురవాణా, రహదారుల శాఖ మంత్రి గడ్కరీ స్పందించారు. ఇథనాల్ పెట్రోల్‌పై చాలా విస్తృత స్థాయిలో పరీక్షలు జరిగినట్లు చెప్పారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడిన కార్లలో ఎటువంటి చెడు ప్రభావం కనిపించలేదని అన్నారు. ఈ-20 పెట్రోల్ వాడకం చాలా ఆరోగ్యకరమైన పరిణామం అని, ఇది హరిత మార్పు అని, ఈ పెట్రోల్‌తో చాలా తక్కువ కాలుష్యం ఉంటుందని, దీని వల్ల విదేశీ మారకం కూడా ఎక్కువగా ఆదా అవుతుందని లోక్‌సభలో గడ్కరీ తెలిపారు. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వల్ల .. ముడి సరుకుల కోసం రైతులకు 40 కోట్లు ఇవ్వడం జరుగుతోందని, ఇథనాల్ తయారీ కోసం చెరుకు, మొక్కజొన్న ముడి పదార్థాలను వాడుతున్నట్లు ఆయన తెలిపారు.పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి మాట్లాడారు. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ అమలు ద్వారా .. గతంలో క్రూడ్ ఇంధనం దిగుమతి కోసం అయ్యే ఖర్చును ఇప్పుడు రైతులకు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనితో రైతులు అన్నదాతలే కాదు, ఇప్పుడు ఊర్జదాతలు కూడా అయినట్లు ఆయన పేర్కొన్నారు. గడిచిన 11 ఏళ్లలో అంటే 2014 నుంచి 2025 జూలై వరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇథనాల్‌ను బ్లెండ్ చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో విదేశీ మారక రూపంలో సుమారు 1.40 లక్షల కోట్లు ఆదా అయినట్లు మంత్రి పేర్కొన్నారు.

## మాజీ మంత్రి వివేకా కేసులో కీలక మలుపు..

హైదరాబాద్,మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివేకా హత్యపై సీబీఐ దర్యాప్తు మధ్యలోనే ఆపేసిందని, హత్యపై ఇంకా చాలా అనుమానాలు ఉన్నాయని, మొత్తం కుట్రను వెలుగులోకి తేవాలని కోరుతూ వివేకా కుమార్తె సీబీఐ కోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు సూచనలతో విచారణ జరిపిన సీబీఐ కోర్టు సీబీఐ దర్యాప్తుపై కొన్ని సూచనలు చేస్తూ ఆదేశాలిచ్చింది. గురవారం రాత్రి పొద్దుపోయేవరకు విచారణ జరిపిన న్యాయస్థానం రాత్రి 9 గంటల సమయంలో తీర్పు ఇచ్చింది.సీబీఐ కోర్టు ఉత్తర్వులు మేరకు వివేకా హత్య కేసులో మళ్లీ పాక్షిక దర్యాప్తు కొనసాగనుంది. 7వ నిందితుడు వైఎస్ భాస్కరరెడ్డి తమ్ముడు వైఎస్ ప్రకాష్ రెడ్డి మనవడు అర్జున్ రెడ్డికి, రెండో నిందితుడు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్ ముందుగా హత్య సమాచారాన్ని ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ ఇద్దరి టెలిఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ కేసులో సునీత సందేహాలు లేవనెత్తిన మిగిలిన నిందితులపై విచారణకు కోర్టు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో ముగించాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.కాగా, సునీత లేవనెత్తిన ప్రధాన సందేహాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడంతో నిందితులకు కాస్త ఉపశమనం లభించినట్లేనంటున్నారు. హత్య జరిగిన రోజు నిందితుడు, కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ వాడుకలోనే ఉందని, ఆయన మాజీ సీఎం జగన్ కు హత్యపై ముందే సమాచారం ఇచ్చి ఉంటారని సీబీఐ సందేహం వ్యక్తం చేసిందని, అయితే ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టుకు నివేదించారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్ లో తాము జగన్ తో సమావేశంలో ఉండగా, భారతీ నుంచి జగన్ రెడ్డికి పిలుపువచ్చిందని, ఆ తర్వాత జగన్ రెడ్డి తమతో




వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారు. ఇక్కడ భారతికి ఎలా సమాచారం వచ్చింది? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని, ఆ విషయంపైనా దర్యాప్తు కొనసాగాలని సునీత పిటిషన్ వేశారు.ఇవేకాకుండా హత్య దర్యాప్తును సీబీఐ సగంలోనే వదిలేసిందని, నిందితులు పరస్పర విరుద్ధంగా వాంగ్మూలాలు ఇవ్వడంపైనా సీబీఐ దృష్టిపెట్టలేదని సునీత అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కోర్టు మాత్రం సునీత లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం అర్జున్ రెడ్డి, కిరణ్ యాదవ్ మధ్య జరిగిన సంభాషణలపైనే విచారణ జరపాలని ఆదేశించింది. కాగా, హత్య జరిగిన రోజు తెల్లవారుజాము 1.42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డి 'వివేకా సర్ చనిపోయాడు' అనే మెసేజ్ వెళ్లిందని సీబీఐ గుర్తించింది. కానీ, ఆ మెసేజ్ పై దర్యాప్తు చేయలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఈ విషయంపైనే దర్యాప్తు కొనసాగనుంది.

## 2 కోట్ల మంది భారతీయులకు ఏఐపై నైపుణ్య శిక్షణ ఇస్తాం: సత్యా నాదెళ్ల

బెంగుళూరు: మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల ఇవాళ బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు.సుమారు 17.5 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ ఫ్లాట్‌ఫామ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు.భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య



భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ అభ్యంతరాలపై స్పందించిన అమిత్ షా



న్యూఢిల్లీ,లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సంస్కరణలపై జరుగుతున్న చర్చలో రాహుల్ గాంధీ అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అమిత్ షా ఘాటుగా స్పందించారు."మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదు... సభా సమావేశాలను మీరు శాసించలేరు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కల్పించుకుని, "ముందు నిన్న నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు.

దీనిపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. తనకు అసెంబ్లీ, పార్లమెంటులో 30 ఏళ్ల అనుభవం ఉందని, తాను ఎప్పుడు మాట్లాడాలో మీరు నిర్దేశించలేరని అన్నారు.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు.విపక్షాలు 'ఓట్ల దొంగతనం' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారిని, విదేశీ పౌరులను తొలగించడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. "చట్టవిరుద్ధ వలసదారులు ఎన్నికల్లో పాల్గొనాలా?" అని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1952 నుంచి 2004 వరకు అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఓటర్ల జాబితా సవరణలు జరిగాయని గుర్తుచేశారు."జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఎవరూ దీనిని వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు?" అని నిలదీశారు. నాలుగు నెలలుగా ఏకపక్ష అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తమకు మద్దతిచ్చే చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు తొలగిపోతాయనే భయంతోనే విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని అమిత్ షా విమర్శించారు.

## భారత్‌కు 'బంగ్లా' దౌత్య ద్రోహం.. పాక్, చైనాలతో జతకట్టి..




న్యూఢిల్లీ: పాకిస్తాన్-చైనా నేతృత్వంలోని కొత్త ప్రాంతీయ కూటమిలో చేరేందుకు బంగ్లాదేశ్ అమితమైన ఆసక్తి చూపిస్తున్నదనే వార్తలు ఇటీవలి కాలంలో విరివిగా వినిపిస్తున్నాయి.ఇది దక్షిణాసియాలో కీలక వ్యూహాత్మక మార్పును సూచిస్తున్నది. భారతదేశం లేకుండా, పాకిస్తాన్‌తో కలిసి ప్రాంతీయ కూటమిలో చేరడం బంగ్లాదేశ్‌కు వ్యూహాత్మకంగా సాధ్యమే అని బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహిద్ హుస్సేన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఢాకా, బీజింగ్, ఇస్లామాబాద్‌లతో కూడిన కొత్త త్రైపాక్షిక సమూహంపై పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ సూచన చేసిన కొద్ది రోజులకే ఈ ప్రకటన వచ్చింది.

**యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథ్యంలో..**

2024ఆగస్టులో షేక్ హసీనా పదవీచ్యుతి అనంతరం పాకిస్తాన్-బంగ్లాదేశ్ సంబంధాలు వాణిజ్యం, రక్షణ, మౌలిక సదుపాయాల రంగాలలో విస్తరిస్తూ వస్తున్నాయి. ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథ్యంలో ఈ రెండు దేశాల మధ్య సహకారం పెరుగుతోంది. గతంలో షేక్ హసీనా ప్రభుత్వం.. న్యూఢిల్లీ, బీజింగ్, వాషింగ్టన్‌లను నొప్పించకుండా సమతుల్య సంబంధాలను చాకచక్యంగా కొనసాగించింది. నాడు భారతదేశం ఒక కీలక భాగస్వామిగా ఉంది. అయితే, ప్రస్తుత పరిస్థితులలో ఢాకా.. ఇస్లామాబాద్, బీజింగ్ వైపు మొగ్గు చూపుతూ, భారత్‌తో సమతుల్య భాగస్వామ్యాన్ని కోల్పోయింది.

**చైనాలోని కున్మింగ్‌లో మంతనాలు**

ఈ ప్రాంతీయ కూటమి చర్చలు గత ఏడాది నుండి వేగం అందుకున్నాయి. గత జూన్‌లో చైనా, బంగ్లాదేశ్,పాకిస్తాన్‌లు చైనాలోని కున్మింగ్‌లో తమ మొదటి అధికారిక త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడి, మౌలిక సదుపాయాలు , రుణ నిర్వహణలో సహకారాన్ని పెంపొందించేందుకు మూడు పక్షాలు అంగీకారం కుదుర్చుకున్నాయి. మరోవైపు పాకిస్తాన్ తాజాగా భారతదేశాన్ని మినహాయించి, చైనాను భాగస్వామిగా చేర్చుకుంటూ, విస్తృతమైన దక్షిణాసియా కూటమిని ప్రతిపాదిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్- బీజింగ్ మధ్య ఈ అంశంపై చర్చలు జరిగాయని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### గోవా ప్రభుత్వం సంచలన నిర్ణయం

పనాజి, నూతన సంవత్సర, క్రిస్మస్ వేడుకలకు గోవా సిద్ధమవుతున్న తరుణంలో నైట్ క్లబ్ అగ్నిప్రమాద ఘటన కలకలానికి దారి తీసింది. ఈ ఘటనలో 25 మంది మృతి చెందడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో రానున్న హాలిడే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని గోవా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో బాణసంచాను నిషేధించింది. ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. సంప్రదాయక బాణసంచాతో పాటు ఎలక్ట్రానిక్స్ ÷ర్ వర్క్స్, నిప్పుతో చేసే ఇతర ప్రదర్శనలు, గేమ్స్‌ను నిషేధించినట్టు గోవా ప్రభుత్వం వెల్లడించింది.

## సంపాదకీయం

శుక్రవారం 12-12-2025

# ఇండిగో బ్లాక్‌మెయిలింగ్

ప్రయాణికులపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ తరచు వార్తల్లోకెక్కే 'వివాద'యాన సంస్థ ఇండిగో... తనకు నచ్చని నిబంధనలు అమల్లోకి రావటాన్ని జీర్ణించుకోలేక వారం రోజులపాటు దేశంలో పౌర విమానయానాన్ని దాదాపు స్తంభింపజేసింది. కనీవినీ ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా మూడు వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయి, వేలాదిమంది ప్రయాణికులు దారీతెన్నూ తోచక ఇబ్బందులు పడ్డారు. కనీసం ప్రత్యామ్నాయాలు వెదుక్కుందామన్నా లగేజీ ఆచూకీ దొరక్క నరకయాతన అనుభవించారు. వారం గడుస్తున్నా యథాపూర్వ స్థితి ఇంకా ఏర్పడలేదు. కాకపోతే కాస్త మెరుగైంది. ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికీ వాటా ఉంది. ఇండిగో ధిక్కరణను పసిగట్టలేని అమాయకత్వం క్షంతవ్యమేనా? తక్కువ చార్జీలతో ప్రయాణికులను ఆకట్టుకుని, సామర్థ్యాన్ని మెరుగుపర్చుకుంటూ, ఎవరికీ అందని స్థాయిలో విస్తరించుకుంటూ పోయిన ఇండిగో ఆ రంగంలో గుత్తాధిపత్యాన్ని నెలకొల్పింది. గత పాతికేళ్లలో మూతబడిన జెట్ ఎయిర్‌వేస్, ఎయిర్ సహారా, ఎయిర్ డెక్కన్, కింగ్‌ఫిషర్ వగైరా 9 సంస్థలు ఇండిగో చకచకా ఎదగటానికి దోహదపడ్డాయి. పర్యవసానంగా పౌర విమానయాన రంగంలో ఇండిగో 61 శాతం వాటాను సాధించగలిగింది. మరో సంస్థ ఎయిరిండియా 30 శాతం దగ్గర నిలిచింది. పోటీదారులందరినీ దాటుకుని శరవేగంతో దూసుకుపోవటం, లాభార్జన అదే స్థాయిలో పెరగటం, స్వల్ప కాలంలోనే సమర్థవంతమైన సంస్థగా పేరు తెచ్చుకోవటం, ఏటా పది కోట్ల మంది ప్రయాణికులను చేరేయటం ప్రశంసించదగ్గ విజయమే కావొచ్చు. కానీ గగనతలంలో 35,000 అడుగుల ఎత్తున ఎగిరే విమానాలతోపాటే దాని అహంకారమూ పడగలెత్తింది. విమానయాన రంగాన్ని శాసిస్తున్న తనకు విధివిధానాలు నిర్దేశించటానికి పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఎవరన్న స్థాయికి చేరుకుంది. అందుకే ఉద్దేశపూర్వకంగా ధిక్కారాన్ని ప్రదర్శించింది. 'కేవలం అవగాహన లేమి వల్లా, ప్రణాళికల రూపకల్పనలో జరిగిన లోటుపాట్ల వల్లా' సర్వీసులకు అంతరాయం ఏర్పడిందన్న ఇండిగో ప్రకటన ఉత్త వంచన. ఎందుకంటే దేశీయ విమాన సర్వీసుల్ని ఎడా పెడా రద్దు చేసిన ఆ సంస్థ... అంతర్జాతీయ సర్వీసుల్లో కేవలం 10 శాతానికి మాత్రమే కోతపెట్టింది. ఆ సర్వీసులు ఇష్టానుసారం రద్దు చేస్తే భారీ మొత్తాల్లో జరిమానాలుంటాయి మరి. డీజీసీఏ ఏర్పరిచిన నిబంధనలు ఇప్పటివి కాదు. గత ఏడాది మొదట్లోనే... అంటే దాదాపు రెండేళ్లనాడే ఆ ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి. లాభార్జన కోసం తక్కువ మందితో ఎక్కువ సర్వీసులు నడిపే ధోరణి ప్రమాదకరమన్న ఉద్దేశంతో విధించిన పరిమితులవి. వారంలో పైలెట్లకుండే విశ్రాంతి సమయాన్ని 36 గంటలనుంచి 48 గంటలకు పెంచటం, రాత్రి వేళల్లో పైలెట్లు పనిచేసే సమయాన్ని 10 గంటలకు పరిమితం చేయటం, ఒక పైలెట్ వారానికి రెండుసార్లకు మించి నైట్ ల్యాండింగ్‌లు చేయరాదన్న నిబంధన అందులో భాగమే. ఇవన్నీ గత నెల 1 నుంచి అమలు చేయాలని కోరింది. ఈ ఏడాది కాలంలో ఇండిగో ఇందుకోసం సాగించిన కసరత్తేమీ లేదు. పైగా ఒకరి పైలెట్లను మరొకరు తీసుకోరాదని వేరే సంస్థలతో లాలూచీకి దిగి పనిగంటలు పెంచింది. సిబ్బంది వేతనాలను స్తంభింపజేసింది. ఇతర సంస్థలన్నీ దారిలోకి వచ్చినప్పుడు ఇండిగోకు మాత్రమే ఏమిటి సమస్య? గండం గట్టెక్కటానికి గత్యంతరం లేక డీజీసీఏ తన నిబంధనలు సడలించుకోవాల్సి వచ్చింది. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఏర్పరిచిన నిబంధనలకే దిక్కులేకపోవటం విషాదం కాదా? బ్లాక్‌మెయిలింగ్‌కు లొంగటం కాదా? ప్రతిదానికీ ప్రైవేటు మంత్రం జపించే పాలకులకు ఇండిగో వ్యవహారం కనువిప్పు కావాలి. సంక్షోభ సమయాల్లో టిక్కెట్ ధరలు పెంచి ప్రయాణికుల జేబులు కొల్లగొడుతున్నా పట్టనట్టుండే ధోరణి ఇండిగో వంటి సంస్థలకు కొమ్ములూ కోరలూ తెచ్చింది. ధిక్కరణకు పురిగొల్పింది. ఉన్న రెండు ప్రధాన విమానయాన సంస్థల్ని సరిగా పర్యవేక్షించలేని కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు చేతగానితనం ఈ పర్యాటక సీజన్‌లో దేశం పరువు తీసింది. ఈ వ్యవహారంలో జవాబుదారీతనాన్ని నిగ్గు దేల్చి కేంద్రమంత్రితో సహా బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలి.

# అధికారం ఉంటే నై.. కోల్పోయాక సై.. కేటీఆర్‌కు మరో దెబ్బ




హైదరాబాద్,రాజకీయాల్లో ఓడలు బండ్లు.. బండ్లు ఓడలు అవ్వడం చాలా కామన్. మన కళ్ల ముందు జరిగిన ఇలాంటి ఘటనలు అనేకం. కానీ పవర్ చేతిలో ఉన్న పదేళ్లు మరిచి.. ఇప్పుడు అధికారం చేజారాక ఉత్సవాలు జరుపుకోవడం అనేది మాత్రం చాలా కొత్త. అదే సమయంలో వింత కూడా. మనం మాట్లాడుకునేది ఎవరి గురించి అనేది ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. కానీ దేని గురించి అనేది తెలుసుకోవాలనకుంటే మాత్రం చూసేయండి.

విజయ్ దివస్‌ను సెలబ్రేట్ చేయాలని బీఆర్ఎస్ పిలుపు..

డిసెంబర్ 9.. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించిన రోజు. అందుకే ఈ రోజును విజయ్ దివస్‌గా జరుపుకుంటోంది తెలంగాణ. అయితే భారత రాష్ట్ర సమితి ఈ వేడుకను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపు రాజకీయ వర్గాలకే కాదు.. పార్టీ నేతలకు కూడా కాస్త షాక్ ఇచ్చిందనే చెప్పాలి.

డిసెంబర్ 9ని ఎప్పుడూ సెలబ్రేట్ చేయని బీఆర్ఎస్

డిసెంబర్ 9 అంటే.. తెలంగాణ ఏర్పాటు గురించి చిదంబరం ప్రకటన చేసిన రోజు. కానీ ఆ రోజును బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. ఎందుకంటే ఆ రోజు కేంద్రం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసినా.. ఆ తర్వాత సమైక్యాంధ్ర ఉద్యమం ఉధృతం కావడంతో వెనక్కి తగ్గి.. మళ్లీ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఇది బీఆర్ఎస్ పార్టీకి నచ్చలేదు. అందుకే డిసెంబర్ 9ని ఎప్పుడూ సెలబ్రేట్ చేయలేదు. దీనికి మరో కారణం కూడా ఉంది. అదేంటంటే ఆ రోజు సోనియాగాంధీ పుట్టినరోజు కాబట్టి.సోనియాగాంధీ బర్త్‌డే రోజు తెలంగాణ ప్రకటన వచ్చిందనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకున్నారు. కానీ బీఆర్ఎస్ నేతలకు అది రుచించలేదు. అధికారంలో ఉన్న పదేళ్లు ఏనాడూ డిసెంబరు 9న ఎలాంటి కార్యక్రమాన్ని జరపలేదు. ఆ రోజు తెలంగాణకు సంబంధించి ఏమీ జరగనట్లే వ్యవహరిస్తూ వచ్చారు. కేసీఆర్ నిరాహార దీక్ష చేసిన రోజు నవంబరు 29ని దీక్షా దివస్‌గా జరుపుతూ వస్తోంది. ఈ ఏడాది కూడా భారీగానే కార్యక్రమాలు నిర్వహించారు.

విజయ్ దివస్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్న కాంగ్రెస్..

కానీ ఈ ఏడాది ఎన్నడూ లేనట్టు విజయ్ దివస్‌ను సెలబ్రేట్ చేయాలని నిర్ణయించింది బీఆర్ఎస్. దీనికి కారణం లేకపోలేదు.. విజయ్ దివస్‌ను కాంగ్రెస్ పార్టీ ఘనంగా సెలబ్రేట్ చేస్తోంది. కానీ తెలంగాణ గురించి ఎలాంటి పాజిటివ్ వార్త వచ్చినా అది తమ ఘనతేనని బీఆర్ఎస్ క్లెయిమ్ చేసుకోవడం ఆనాదిగా వస్తున్నదే. కానీ ఇన్నేళ్లుగా డిసెంబర్ 9 విషయంలో మాత్రం సైలెంట్‌గా ఉంటూ వస్తున్నారు. దీంతో క్రెడిట్ కాంగ్రెస్ ఖాతాలో పడుతుంది అనుకున్నారేమో.. వెంటనే ఈ ఏడాది కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీంతో షాక్ అవ్వడం ప్రజలతో పాటు బీఆర్ఎస్ నేతల వంతు అయ్యింది. బీఆర్ఎస్ తీసుకున్న ఈ నిర్ణయంపై కల్వకుంట్ల కవిత కూడా రియాక్ట్ అయ్యారు. అధికారం కోల్పోయాక దీక్షా దివస్‌లు.. విజయ్ దివస్‌లు సెలబ్రేట్ చేస్తున్నారు.. ఇది ఉద్యమాల గడ్డ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు అంటూ ఓ పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌తోనే అర్థమవుతుంది.. బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయం ఎలా బూమారాంగ్ అయ్యిందో.

కాంగ్రెస్‌కు కౌంటర్ గానే కార్యక్రమాలనే చర్చ..

నిజానికి గతేడాది కూడా కాంగ్రెస్ పార్టీ విజయ్ దివస్‌ని సెలబ్రేట్ చేసింది. అప్పుడు సైలెంట్‌గానే బీఆర్ఎస్. కానీ ఈ ఏడాది ఆ జోష్‌ను మరింత పెంచింది అధికార పార్టీ. దీంతో కౌంటర్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది బీఆర్ఎస్. కానీ ఇది కూడా ఇప్పుడు రివర్స్ అవుతుంది. చేస్తే మొదటి నుంచి చేయాలి.. లేదంటే చేయకూడదు. అలాకాకుండా.. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా.. విపక్షంలో ఉన్నప్పుడు సెలబ్రేట్ చేయడం రాజకీయ ఎత్తుగడకాకపోతే మరేంటి అనే చర్చ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తున్న మాట.

## రోడ్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయండి

కామారెడ్డి, కామారెడ్డి జిల్లా కేంద్రంలో రవాణ్యా సౌకర్యం మెరుగు పడేందుకు సహకరించి నిధులు విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి దిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. కామారెడ్డిలో మూడు ఆర్ఓబీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి), ఒక ఫుట్ ఓవర్ వంతెనలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని స్నేహపురి కాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు, వికాస్ నగర్ కాలనీ నుంచి ఇస్లాంపూర్ వరకు, పాత రాజంపేట రైల్వే గేట్ వద్ద ఉన్న ప్రియా టాకీస్ నుంచి ఇందిరా చౌక్ వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసేందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించండి

మంచిర్యాల,బీఆర్ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తాండూర్ మండలం బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ మద్దతు తీసుకొని పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం మంగళవారం రాత్రి మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశర చేశారు. బీఆర్ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులకోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించాలని కోరారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన వాగ్దానాలు మర్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. మరోమారు బూటకపు వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని, అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిన ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని దుర్గం చిన్నయ్య కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలో ఉన్న అభ్యర్థులు, తదితరులున్నారు. సీఎం రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యల వల్ల కాంగ్రెస్ సర్కారుపై రైతులు, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం రాత్రి తాండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దత్తాత్రేయ రావు నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దుర్గం చిన్నయ్య వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో తాను చేసిన అభివృద్ధి మాత్రమే ప్రజలు గుర్తు చేస్తున్నారని, కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిందన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## నేనే ప్రతిపక్షనేతను..

బెంగళూరు: 'నేనే నిజమైన ప్రతిపక్ష నేతనని' అడ్జస్ట్‌మెంట్ రాజకీయ నేతను కానని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. బెళగావి శాసనసభ సమావేశాలలో ప్రశ్నోత్తరాల వేళ రాష్ట్రంలో సాగునీటి పథకాలకు సంబంధించి భూస్వాధీన ప్రక్రియపై ఆయన ప్రసంగించారు. కృష్ణా ఎగువ ప్రాజెక్టు నిర్మాణాలు జరిగి ఆరు దశాబ్దాలు పూర్తయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ప్రధానంగా కృష్ణా నదికి అనుబంధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పాలనలో ప్రారంభమైందని ఇప్పటికి ఆరు దశాబ్దాలు ముగిసినా ఇంకా మూడోవిడత పనులు చేపట్టలేద`న్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర కర్ణాటకకు శాశ్వతంగా సాగు, తాగునీరు సాధ్యం కానుందన్నారు. ముంపు పరిహారం, పునరావాసం, కాలువల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. వీటికి రూ.70వేల కోట్ల మేర పరిహారం ఖర్చు కానుండగా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు మరో రూ.50వేల కోట్లు అవసరమన్నారు. ఇలా కృష్ణా ఎగువ ప్రాజెక్టుకు కనీసంగా రూ.1.20లక్షల కోట్లు అవసరం కానుందన్నారు. ఎన్నేళ్ళకు గ్రాంట్లు మంజూరు సాధ్యం కానుందన్నారు. 2023లోనే పరిహారానికి సంబంధించి కోర్టు అవార్డుకు అనుబంధంగా ఇవ్వాలన్నారు. పరిహారం విషయంలో కోర్టు సూచించిన మేరకు ఇవ్వాలని పట్టుబట్టారు. ఇదే విషయమై జలవనరుల శాఖా మంత్రి డీకే శివకుమార్‌అభ్యంతరం తెలిపారు. దీనిపై యత్నాళ్ మాట్లాడుతూ కోర్టు సూచించిన విధంగా పరిహారం ఇవ్వలేమని చెప్పడం సరికాద న్నారు. ఇదే విషయమై గతంలో కృష్ణా నదికి అనుబంధంగా ఉండే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు అభ్యంతరం తెలిపాయన్నారు. ప్రాజెక్టు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం పరిహారం విషయంలో కోర్టు తీర్పును పాటించలేమని చెప్పడం సమంజసం కాదని సభనుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత బలి...

సమాజంలో ఆన్‌లైన్ గేమ్‌లకు యువత బలవుతున్నారని ఇటీవల హాసన్ జిల్లాలో పలు కేసులు నమోదైన విషయాన్ని సకలేశపుర ఎమ్మెల్యే సిమెంట్ మంజు సభలో ప్రస్తావించారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ నేరాలను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే విషయమై హోంమంత్రి పరమేశ్వర్ వివరణ ఇస్తూ 2023లో 22,255 సైబర్ నేరాలు నమోదు కాగా 2024వ ఏడాది 22,478 కేసులు, 2025లో ఇంతవరకు 13000ల కేసులు నమోదైనట్లు తెలిపారు. గడిచిన మూడేళ్ళతో పోల్చితే కేసులు తగ్గినట్లే అన్నారు. కాగా మూడేళ్ళలో 10,717 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇదే సందర్భంలోనే బీజేపీ సభ్యుడు సునిల్‌కుమార్ జోక్యం చేసుకుని వచ్చేనెలలో ముఖ్యమంత్రి ఎవరు అనే అంశంపైనా అన్నివర్గాలు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని ముందుగా ఎవరనేది నిర్ధారిస్తే బాగుంటుందన్నారు. దీంతో స్పీకర్ ఇటువంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

# వేతనాల పెంపు కోసం అంగన్‌వాడీల పోరు

అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్పు తదితర సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 12న సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు మూడు సంఘాల సారథ్యంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించాయి. 2023 డిసెంబర్ 12న ఈ మూడు అంగన్వాడీ సంఘాల నాయకత్వంలో వేతనాలు పెంపుతో సహా దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె జరిగింది. ఆ సమ్మె కాలంలో అప్పటి ప్రభుత్వం అంగన్వాడీల మీద 'ఎస్మా' లాంటి క్రూర చట్టాలను తీసుకొచ్చి ఉక్కుపాదంతో అణచాలని తీవ్ర ప్రయత్నాలు చేసింది. షోకాజ్ నోటీసులు ఇచ్చి వేల మందిని తొలగిస్తున్నామని ప్రకటనలు చేసింది. అయినా అంగన్వాడీల ఐక్యత ముందు అవన్నీ భోగిమంటల్లో కలిసిపోయాయి. తీవ్ర నిర్బంధాలను ఎదిరించి 2024 జనవరి 22 తారీఖున నిర్వహించిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి వేలాదిమంది అంగన్వాడీలు హాజరై విజయవాడలో బైఠాయించారు. అప్పటి పోరాట ఫలితంగా మంత్రివర్గంతో జరిగిన చర్చల్లో సందర్భంగా 2024 జులైలో అంగన్వాడీ యూనియన్లతో చర్చించి ఆమోదయోగ్యమైన రీతిలో వేతనాలు పెంచుతామని, మిగిలిన సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా మినిట్స్ కాపీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటి అమలు గురించి పట్టించుకోవడం లేదు.

ప్రతిపక్షంలో బలపర్చి ఇప్పుడు మౌనం..

సమ్మె సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, కూటమి నాయకత్వం అంగన్వాడీల సమ్మెను బలపరిచారు. ఆ డిమాండ్లు న్యాయమైనవని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే వేతనాల పెంపు, గ్రాట్యూటీ, అమలు తదితర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మినీ వర్కర్స్ సమస్యలు, మట్టి ఖర్చులు జిఓ లాంటి కొన్ని సమస్యలు పరిష్కారం అయినా వేతనాల పెంపు గురించి పట్టించుకోవడం లేదు. 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదు. ఈ కాలంలో నిత్యవసర సరుకుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పని భారం పెరిగింది. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పని భారం పెంచారు. మరోవైపు కొన్ని జిల్లాల్లో (గుంటూరు, పల్నాడు, అనంతపురం, శ్రీకాకుళం) రాజకీయ వేధింపులు వలన కొంతమంది అంగన్వాడీలను అక్రమంగా తొలగిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజా ప్రతినిధులు మా వాళ్ళని పెట్టుకోవాలని పేరుతో అధికారుల ద్వారా అక్రమ 'మెమో'లు ఇస్తున్నారు. ఇటీవల సత్యసాయి జిల్లాలో సెంటర్లో ఉన్న హెల్పర్‌ను జుట్టు పట్టుకొని లాగి కొట్టిన ఘటనలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోయినా కేంద్ర ప్రభుత్వం పెట్టిన పోషణ ట్రాకర్ యాప్, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌లన్ని అమలు చేయాలని ఒత్తిడి పెంచారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫోన్లు పనిచేయట్లేదు, యాప్‌లు పనిచేయటం కష్టంగా ఉందని తెలియజేసినా ఫలితం లేదు. ఆగస్టు నెలలో పాత మొబైల్స్ వాడకుండా ఆన్లైన్ వర్క్ బంద్ చేసి నిరసన తెలియజేశాం. ఫలితంగా 4,687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జిఓ సాధించడంతోపాటు, కొత్త మొబైల్స్ ఇస్తామని హామీ ఇచ్చారు.

సమ్మె హామీల అమలు కోసం ఉద్యమం

అంగన్వాడీలకు వేతనాలు పెంపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, సంక్షేమ పథకాలు అమలు రకరకాల యాప్‌లు వంటి సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిని సాధించుకునేందుకు మూడు అంగన్వాడీ సంఘాలు మరోసారి ఐక్య ఉద్యమానికి సిద్ధం అవుతున్నాయి. అందులో భాగంగా 2023 డిసెంబర్ 12న సమ్మె ప్రారంభించిన రోజును 2025 డిసెంబర్ 12న ఒక రోజు సమ్మె చేస్తూ అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చాయి.

ఐసిడిఎస్‌ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం చెబుతున్న వికసిత భారత్, విశ్వగురు, 'బేటీ బచావో బేటీ పడావో' ఇవన్నీ నినాదాలకే పరిమితమైనవి. భారతదేశంలో 0 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు 37 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉన్నారు.



17 శాతం మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆహారం అందక 5 సంవత్సరాలలోపు పిల్లలు 8.8 లక్షల మంది మరణిస్తున్నారు. మాతృ మరణాలు, శిశుమరణాలు తగ్గించడంలో అనుబంధ పోషకాహారం అందించడంలో ప్రీ స్కూల్ విద్య అందించడంలో ప్రాధాన్యత కలిగిన ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.21,960 కోట్లు కేటాయించింది. 2017 నుండి అనుబంధ పోషకాహారానికి నిధులు పెరగలేదు. ఆహార భద్రతకు, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించేశారు. నిధులు కొరత వలన లబ్ధిదారుల లిస్టులు తగ్గించే ప్రయత్నాలను అడ్డుకోవటానికి ప్రజలను సమీకరించి పోరాడుతుంది. గుజరాత్ హైకోర్టు : ఈ కాలంలో గుజరాత్ రాష్ట్ర హైకోర్టు అంగన్వాడీల జీతాల పెంపుదలకు సంబంధించి జ/రీరీ%జ/స్రాూ/363/2025, ఙ్ఖవ%: 20-08-2025. ప్రకారం అంగన్వాడీ హెల్పర్‌ను 4వ తరగతి ఉద్యోగిగా, అంగన్వాడీ వర్కర్‌ను 3వ తరగతి ఉద్యోగిగా, గుర్తించాలని తీర్పునిచ్చింది. అంతేకాదు అంగన్వాడీల జీతాలను పే రివిజన్ కమిషన్ (పి.ఆర్.సి)కి అనుసంధానం చేసి పిఆర్‌సి రికమెండేషన్స్ ప్రకారం పెంచాలని చెప్పింది. ఆ ప్రకారం చేస్తే అంగన్వాడీ వర్కర్‌లకు రూ.2,4800/-లు, అంగన్వాడీ హెల్పర్‌లకు రూ.20,300/-కు జీతం పెంచాల్సి ఉంటుంది. హైకోర్టు తీర్పు ఇచ్చిన రోజు నుండి ఎరియర్స్ కూడా ఇవ్వాలని చెప్పింది. గుజరాత్ మోడల్, డబుల్ ఇంజన్ పరిపాలన అంటూ మాట్లాడే కూటమి పాలకులకు గుజరాత్ హైకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేయాలన్న ఆలోచన చేయక పోవడం దారుణం.

పనిభారంతో కుదేలు

పని భారాలు, యాప్‌ల ఒత్తిళ్లతో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మానసిక ఒత్తిళ్లకు గురౌతున్నారు. రకరకాల అనారోగ్యల పాలౌతున్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలో సెంటర్లోనే ఉన్న వర్కర్కు హార్ట్ స్ట్రోక్ వచ్చి సెంటర్లోనే చనిపోయింది. కర్నూలు జిల్లా కలెక్టరు గారు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాగా చిన్న పొరపాట్లకి టెర్మినేషన్ ఆర్డర్ ఇస్తున్నారు. ప్రకాశం జిల్లా ఐసిడిఎస్ పీడీ గారు అసలు అంగన్వాడీ సమస్యలు వినటానికి గాని, అర్జీ తీసుకోవటానికి కూడా సిద్ధపడట్లేదు. హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా చెవిటి వాళ్ళ ముందు శంఖం ఊదినట్లు ఉంది. దీనివలన రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల, అనంతపురం తదితర జిల్లాల్లో అర్హత కలిగిన హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వలేదు. రాజకీయ నాయకుల ఒత్తిడితో అనర్హులకు ప్రమోషన్లు ఇస్తున్నారు. ఈ చర్యలను ఆపాలి.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలని, మిగిలిన 1,810 మినీ సెంటర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, కార్మికులు నష్టదాయకమైన కార్మిక కోడ్లు రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ జిఓ మార్పు చేసి తక్షణమే అమలు చేయాలని, రకరకాల యాప్‌లు రద్దు చేసి ఓకే యాప్‌ను మాత్రమే వినియోగించాలని, నాణ్యమైన 5జి ఫోన్ ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని, అంగన్వాడీ సెంటర్ల అద్దెలు సకాలంలో చెల్లిస్తూ, ఉచితంగా వంట గ్యాస్ అందించాలన్నవి ప్రధాన డిమాండ్లు.

## రెండో విడత ల్యాండ్ పూలింగ్

అమరావతి,రాజధాని అమరావతిలోని తుళ్ళూరు మండలంలో మంత్రి నారాయణ పర్యటించారు. వడ్డమాను గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు రైతులు అంగీకారం తెలిపారు. అయితే కౌలు ప్యాకేజీ పెంచాలని మంత్రికి రైతులు వినతి చేశారు. గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పాసుపుస్తకాలను మంత్రి నారాయణకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏడు గ్రామాల్లో 16.666 వేల పైచిలుకు భూమి అవసరమన్నారు. 2014 -19 లో రాజధాని రైతుల సలహాలతో పాలసీ నిర్ణయించామని.. అదే విధంగా రైతులతో చర్చించి వారి నిర్ణయాల ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ప్రభుత్వం మారటం వలన గత ప్రభుత్వం కేసుల వల్ల జాప్యం జరిగిందన్నారు. తమ పరిధిలో చేయగలిగిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైన్లు సరి చేయమని రైతులు కోరారని.. అది పూర్తి చేస్తామని చెప్పారు. 29 గ్రామాలను అభివృద్ధి చేయడానికి రూ.900 కోట్లు అవసరమని తెలిపారు. ఆరు నెలల్లో తొమ్మిది గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఆదేశాలు ఇచ్చామన్నారు. వడ్డమాను గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతులు ఏ విధంగా అడిగితే అలా అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఇంటికో పారిశ్రామిక వేత్తకాదు..

గుంటూరు, ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తల సబ్సిడీ విడుదలపై ప్రభుత్వం వెంటనే కళ్ళు తెరవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మంగళగిరి ఏపీఐఐసీ భవనం గేటు వద్ద రాష్ట్రవ్యాప్తంగా 8,000 మంది ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 100 శాతం సబ్సిడీ చెల్లించాలని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలోనిరవధిక ధర్నా చేపట్టారు. ఈ శిబిరాన్ని సందర్శించిన శ్రీనివాసరావు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇంటికొక పారిశ్రామిక వేత్తను చేస్తానని చంద్రబాబు నాయుడు చెప్పటం బాగానే ఉందని, ఉన్న ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఇవ్వవలసిన సబ్సిడీలను విడుదల చేయటంలేదని అన్నారు. విడుదల చేయకపోవడం వలన పారిశ్రామికవేత్తలు వీధుల బయట తిరుగుతూ ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. ఏ రకమైన సహాయ సహకారాలనైనా అందిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్సిడీలు చెల్లిస్తారని ఆశపడ్డారని? కానీ క్రమక్రమంగా అవి ఆవిరై పోయాయని తెలిపారు. దీంతో పారిశ్రామికవేత్తలుగా ఉన్న ఎస్సీ ఎస్టీ మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి దుర్భర పరిస్థితి ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. చంటి పిల్లలతో ఇక్కడకు వచ్చి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా రావలసిన చెల్లింపులు రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక్కడకు వచ్చినవారిని వాష్ రూములకు కూడా పోనివ్వకుండా అధికారులు వారిపై జులుం ప్రదర్శించడం దారుణమన్నారు. కులవివక్ష చూపుతున్నారని విమర్శించారు. కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. ఇక్కడ కూర్చొని అన్నం తింటున్న ప్లేట్లను విసిరి వేయడం దారుణమైన చర్య అన్నారు. కనీసం మానవ హక్కులు కూడా లేకుండా ఇక్కడ అధికారి యంత్రాంగం ఉందని ధ్వజమెత్తారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం పోలీస్ స్టేషన్లో కేసు పెట్టాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ఇక్కడ ఉన్నది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? అగ్రవర్ణ ప్రభుత్వమా అని ప్రశ్నించారు. పెద్ద కంపెనీలకు వందల కోట్ల రూపాయలను పూర్తిగా చెల్లించడం జరిగిందని అన్నారు. దీన్ని బట్టి చూస్తే సామాజికంగా అణిచివేసేందుకు ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. 600 కోట్ల రూపాయలు చెల్లించవలసిన డబ్బులు లేకపోవడం దారుణమన్నారు. గూగుల్ కు 22 వేల కోట్ల రూపాయలు ఇవ్వడానికి ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా పరిపాలన చేస్తున్నామని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం పార్టీ లాగా చూడడం దారుణమని అన్నారు. నెల్లూరులో పెంచలయ్యను హత్య చేసినా ఖండించలేని పరిస్థితిలో హోం మంత్రి ఉన్నారని అన్నారు. అలాంటి హోం మంత్రి ఇక్కడ మహిళలను అవమానపరుస్తున్నప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ సమస్యను సామాజికంగా అణగారిన ప్రజల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తెలియజేస్తుందని అన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ?. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 100 శాతం రాయితీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే కెవిపిఎస్ తరఫున ఈ శాఖ ఉన్నతాధికారులకు లేఖలు కూడా రాయడం జరిగిందని అన్నారు. సిపిఎం నాయకులు కూడా లేఖలు రాశారని అన్నారు. అయినప్పటికీ ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. రాయితీలు విడుదల చేసే వరకు ఇక్కడే ఉండి సాధించుకోవాలని వి.శ్రీనివాసరావు కోరారు.

# లోపమెక్కడ?

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్ర నాయకత్వంలో వ్యూహాత్మక లోపాలపై విస్తృత చర్చ జరుగుతోంది. సరైన మేథోమధనం లేకపోవడం, ప్రస్తుత రాజకీయాలకు తగ్గట్టు ఎత్తుగడలు వేయలేకపోవడం వల్ల ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ క్రమంగా కనుమరుగు అవుతున్న పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. గుడ్డిలో మెల్లలా ఒకటి రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినా, ఆ అధికారం నిలబెట్టుకోవడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో మూడు రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ఆ మూడుచోట్ల అంతర్గత సమస్యలు ఇబ్బందికరంగా మారాయని అంటున్నారు. ప్రధానంగా కొన్నిరోజులుగా కర్ణాటక రాజకీయాల్లో కొనసాగుతున్న రచ్చ.. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వంలో నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని అంటున్నారు. 2023లో రికార్డు మెజార్టీతో కన్నడ నాట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ అధికారాన్ని నిలబెట్టుకోడానికి ఆపసోపాలు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పీఠం ఆశించారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన విస్తృతంగా పర్యటించి, తానే సీఎం అభ్యర్థిని అంటూ ప్రచారం చేసుకున్నారు. ఇదేసమయంలో ప్రస్తుత సీఎం సిద్దరామయ్య కూడా సీఎం అభ్యర్థిగానే బరిలో దిగారు. ఇలా ఇద్దరు నేతల మధ్య సీఎం కుర్చీపై పోటీ ఎన్నికల ముందు నుంచే మొదలైంది. అయితే అప్పట్లో ఇద్దరినీ ప్రోత్సహించిన కాంగ్రెస్.. వివాదాన్ని తెగని పంచాయతీగా మార్చేసిందన్న విమర్శలకు కారణమైంది. అధిష్టానం సూచనలతో తొలుత సిద్ధూకు ముఖ్యమంత్రి పదవి వదులుకున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇప్పుడు సీఎం పీఠంపై ఆశలు పెంచుకుంటూ ఆ దిశగా పావులు కదుపుతున్నారు.తన మనసులో మాటను బహిరంగంగా బయటపెట్టకపోయినా, ఆయన చేస్తున్న ప్రయత్నాలు అన్నీ సీఎం సీటుపై కూర్చోవాలనే ఆలోచనకు సంకేతాలుగానే చెబుతున్నారు. దాదాపు రెండు నెలలుగా ఆయన అధికార మార్పిడిపై ఒత్తిడి చేస్తూ వస్తున్నారు. ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకోవాల్సిన కాంగ్రెస్ అధిష్టానం నాన్చుతూ వస్తోంది. దీంతో గతంలో రాజస్థాన్ లో కాంగ్రెస్ అవలంబించిన విధానమే ఇప్పుడు పాటిస్తోందా? అన్న చర్చ జరుగుతోంది. 2023కు ముందు రాజస్థాన్ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేది. ఆ సమయంలో యువకుడైన సచిన్ పైలట్ సీఎం సీటు ఆశించగా, వృద్ధ నేత అశోక్ గెహ్లాత్ ను కాంగ్రెస్ ప్రోత్సహించింది. దీంతో రెండోసారి ఆ రాష్ట్రంలో అధికారం కాపాడుకోల ేకపోయిందని అంటున్నారు.ఇప్పుడు కర్ణాటకలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే మరో రాజస్థాన్ గుర్తుకు వస్తోందని కాంగ్రెస్ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. సీఎం, డిప్యూటీ సీఎం మధ్య అధికార బదిలీపై తొలి నుంచి అధిష్టానం నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తుండటం వల్ల పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోందని అంటున్నారు. ప్రజల్లో కూడా పార్టీపై చులకన భావం ఏర్పడుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. డీకే శివకుమార్ కోర్కెను ఆమోదిస్తున్నది? లేనిది స్పష్టం చేయకపోవడం వల్ల ఆయన ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణితో తన మనోగతాన్ని ఆవిష్కరిస్తున్నారు. దీంతో కర్ణాటక రాజకీయం తరచూ పతాక శీర్షికలకు ఎక్కుతోందని అంటున్నారు. ఇక తాజాగా కర్ణాటక రాజకీయాలపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా జోక్యం చేసుకున్నారని అంటున్నారు. ఈ నెల 15 వరకు ఎవరూ కర్ణాటక పీటముడిపై మాట్లాడొద్దని, ఆ రోజు ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. సోనియా ప్రియ శిష్యుడిగా పేరున్న డీకే శివకుమార్ కు ఆ రోజు అయినా రూట్ క్లియర్ అవుతుందా? లేకపోతే ఆయన ప్రయత్నాలకు ఎండ్ కార్డు వేస్తారా? అనే ఉత్కంఠ నెలకొంది.

# పల్లెలే దేశానికి వెన్నెముక ...



అమరావతి, పల్లెలే దేశానికి వెన్నెముక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పల్లెల కోసమే పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. పదేపదే సమీక్షలు నిర్వహించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నా అని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ సహకారం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నామని.. అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పుడు సంస్కరణల ద్వారా పదోన్నతలు ఎలా వచ్చాయో అందరికీ బాగా తెలుసన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించానని వెల్లడించారు. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతు లు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉందని పవన్ అన్నారు. కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకుంటే తప్పు.. తీసుకోకుంటే ఒప్పు అయిన పరిస్థితులు ఎదురయ్యాయని చెప్పుకొచ్చారు. అయినా కూడా తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంగా తన సొంత తెలివి తేటలు ఏమీ కూడా వాడడంలేదన్నారు. బలమైన అధికారులు తనతో ఉన్నారని.. రిఫామ్స్ తీసుకువచ్చి పనిచేశారని అన్నారు. గతంలో చాలా అంశాల్లో పారదర్శకత లేదని తన దృష్టికి తీసుకు వచ్చారని.. సమీక్షల సమయాల్లో చిన్న చిన్న మార్పులు తీసుకువచ్చి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. తన తండ్రి ఒక ప్రభుత్వ ఉద్యోగి అని.. తనకు ఉద్యోగులంటే ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. ఇంట్లో, ఆఫీసుల్లో ఉద్యోగులకు ఉండే సాధక బాధకాలపై తనకు అవగాహన ఉందని చెప్పుకొచ్చారు. ఉద్యోగులకు ఏమి చేయాలని ఆలోచన చేస్తే.. రిఫామ్స్ తేవాలని అధికారులు చెప్పారని అన్నారు. కష్టపడి పని చేసే వారికి ఎదుగుదల ఎంతో ముఖ్యమని భావించి అమలు చేశామని డిప్యూటీ సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, మౌలిక వసతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వారు ఉద్యోగుల ఇబ్బందులను కూడా కనీసం పట్టించుకోలేదన్నారు. తాము ఉద్యోగుల ఇబ్బందులు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికలు అమలు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో దాదాపు రెండు లక్ష్లల మంది అవుట్ సోర్సింగ్‌లో ఉన్నారని.. వీరికి పదోన్నతలు ఎలా చేయాలనే అంశంపై మాట్లాడితే వెంకటకృష్ణ వెనెముకలాగా పనిచేశారని తెలిపారు. నేటికీ మన దగ్గర వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే వెంకట కృష్ణ, శశిభూషణ్ లాంటి అధికారులు ఉండటమే కారణమని చెప్పారు. ఇదంతా ఒక్కరు చేసింది కాదని.. అందరూ సమిష్టిగా అధికారుల సమూహం పని చేయడం ద్వారానే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. తాను ఎక్కడా జోక్యం చేసుకోలేదని.. క్లీన్ గవర్నెన్స్ కావాలని మాత్రమే అధికారులకు చెప్పానని తెలిపారు. తన తండ్రి తాలూకా అనుభవం తనకు పని చేసింది కాబట్టే.. సీనియారిటీ, క్యాపబులిటీ చూడాలని మాత్రమే చెప్పానన్నారు. బదిలీలు, పదోన్నతులపై అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సు లెటర్లు ఇచ్చారని.. అయితే వారు సిఫార్సు చేసిన అధికారికి అర్హత ఉంటేనే చేయాలని స్పష్టంగా చెప్పామన్నారు. ఉమ్మడి ఏపీలో కూడా ఈ విధానం అమలు కాలేదని.. ఈ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం అయ్యిందని పవన్ చెప్పారు. పూర్తి పార్శదర్శకంగా పదోన్నతలు చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాలలో మంచి సేవలు అందించాలని కోరుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కూడా సంపదను పెంచిన తర్వాత హక్కుల గురించి, జీతాల పెంపు గురించి మాట్లాడాలని ఉద్యోగులకు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ గాడిన పడకుండా.. అన్నీ ఒకేసారి చేయలేం అనేది గుర్తించాలని పవన్ అన్నారు. గ్రూప్ 1 ద్వారా ఎంపీడీఓలు, డీడీలుగా పదోన్నతిని చట్టబద్ధంగా అమలు చేశామని అన్నారు. సీఎం చంద్రబాబు సహకారం వల్లే నేడు ఇంతమందికి పదోన్నతులు కల్పించకలిగామన్నారు. పంచాయతీ కార్యదర్శి పేరును.. పంచాయతీ డెవలప్ మెంట్ ఆఫీసర్‌గా మార్చామని.. 73వ రాజ్యాంగ సూర్తితో గ్రామాలలో డీడీఓ కార్యాలయాలను ప్రారంభించా మన్నారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో పూర్తిస్థాయి సిబ్బందితో పని చేసేలా చేశామని చెప్పారు. అన్ని స్థాయిల ఉద్యోగులు ఒకే చోట నుంచి పని చేసేలా సౌకర్యాలు కల్పించామన్నారు. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేధింపులు రాకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులపై దాడి జరిగితే మాత్రం క్షమించేది లేదని.. వారి రక్షణ చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. అది ప్రజాప్రతినిధి అయినా, రాజకీయ నేత అయినా చర్యలు తీసుకుంటామని అన్నారు. తన శాఖ పరిధిలో ఉన్న అధికారిని దూషిస్తే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఉద్యోగులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పవన్ తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఉద్యోగులదే కీలక బాధ్యత అని.. మరింత విస్తృతంగా సేవలు అందించాలని అన్నారు. ప్రస్తుతం తీసుకు వచ్చిన సంస్కరణలు నేడు ఆరంభం మాత్రమే అని.. ముందు ముందు చట్టబద్ధంగా మరిన్ని సంస్కరణలు చేస్తామని వెల్లడించారు. 'ప్రతి ఉద్యోగి నా శాఖల్లో నా కుటుంబ సభ్యుడే.. ప్రజలకు సేవలు చేయడం మీ వంతు.. మిమ్మల్ని మంచిగా చూడటం మా బాధ్యత. మీకు ప్రమోషన్లు వస్తే ఎంత ఆనందం చూపారో.. మీ వద్దకు వచ్చే పౌరుడు కూడా మీ సేవలు ద్వారా అంతే ఆనందం పొందాలి. తప్పు చేస్తే నాతో సహా ఎవరైనా శిక్షార్హులే అనేది అందరూ గుర్తుంచుకోండి. పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించాలని కమిషనర్‌ను కోరుతున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

### అందరూ ఓటేయడానికి రండి

యాదాద్రి భువనగిరి,గ్రామాల్లో ప్రజలకు సేవ చేసే మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటేయడానికి రావాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని అన్నారు. వలిగొండ, ఆత్మకూరు మండలాల్లో ఆయన పర్యటించారు. పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్?ను పరిశీలించారు. అనంతరం స్వీప్ 2025లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని సర్వేపల్లిలో మోడల్ పోలింగ్ బూత్ ని పరిశీలించారు. పోలింగ్ బూత్ ముందు పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్ !

న్యూఢిల్లీ,లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించండ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల



సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

## ఇందిరమ్మ చీరల్లో కమీషన్ల కక్కుర్తి

వరంగల్,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీలో, మహిళా సంఘాల పేరుతో తీసుకున్న రూ.450 కోట్ల రుణంలో కమీషన్లకు కక్కుర్తి పడి అతి పెద్ద కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో నిర్వహించిన సర్పంచి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీల అమలులో విఫలమయ్యారని చెప్పారు. ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ పేరుతో ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన బిడ్డల హక్కులను కాలరాసే ప్రయత్నం చేసిందన్నారు. రైతు బంధు, భరోసా పథకం అమలు చేసి రైతులకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. భారత రాష్ట్ర సమితి సర్పంచి అభ్యర్థి ప్లలెల పావనిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బియ్యాల నళినీదేవి, మాజీ సర్పంచి ఫీర్నాకి రజిత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అనిల్, సోమేశ్వర్ రావు, ధీరజ్ రావు, పలువురు పాల్గొన్నారు.

## సాధారణ ఎన్నికలను మించి స్థానిక ఎన్నికల ప్రచారం

ఆదిలాబాద్,గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారంతో తొలివిడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం ఉదయం తొలివిడత ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రారంభంకానుంది. తొలి విడత కింద 6 మండలాల పరిధిలో 166 గ్రామ పంచాయతీలు, 1390 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అభ్యర్థులు ఓటర్ల మద్దతు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సొంతంగా మేనిఫెస్టోలను రూపొందిస్తూ.. ప్రచారం చేపట్టడం విశేషం. ఒప్పంద పత్రాలు, బాండ్ పేపర్లను రాసి ఇస్తున్న వైనం గతంలో ఎప్పుడూ లేదు. వివిధ రకాల ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేస్తున్నారు. ప్రశాంతంగా ముగిసిన తొలివిడత ఎన్నికల ప్రచారం ముగియడంతో రాత్రి వేళల్లో నేరుగా కలుసుకుని ఓటును అభ్యర్థించారు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్లను రాబట్టేందుకు అభ్యర్థులు దేనికైనా తగ్గేదే లేదంటున్నారు. అప్పులు చేసి మరీ ఎన్నికల్లో నెగ్గేందుకు సిద్ధమవుతున్నారు. తొలివిడత ఎన్నికలు జరగే గ్రామాల్లో అభ్యర్థులు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధాన పార్టీల మద్దతుతో గెలిచేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఊరిని బాగు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. అయితే గత పక్షం రోజులుగా సాగిన మొదటి విడత ఎన్నికల ప్రచారం మంగళవారంతో ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, అసంపూర్తిగా ఉన్న ఆలయాలు, కుల సంఘ భవనాల నిర్మాణం పనులపై హామీలు ఇస్తున్నారు. అలాగే తమను గెలిపిస్తే గ్రామాల్లో చేపట్టే పనులకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో జోరుగా వైరల్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.

# 3 డేటా సెంటర్లు

హైదరాబాద్:రియల్ ఎస్టేట్ రంగం గత పది సంవత్సరాలుగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పుకు ప్రధాన కారణం ఐటీ పరిశ్రమ విస్తరణ. హైటెక్ సిటీ ఆవిర్భావంతో ప్రారంభమైన ఈ ప్రగతి మొదట మాదాపూర్ వరకు పరిమితమై ఉండగా, తర్వాత గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, కొండాపూర్ వంటి ప్రాంతాలకు విస్తరించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా వంటి బహుళజాతి సంస్థలు, అలాగే టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దేశీయ సంస్థలు పెద్ద ఎత్తున కార్యకలాపాలు నిర్వహించటం వల్ల పశ్చిమ హైదరాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.ఐటీ ఉద్యోగుల పెరుగుదల, మెరుగైన మౌలిక సదుపాయాలుఇవి కలిసి పశ్చిమ హైదరాబాద్‌ను రియల్ ఎస్టేట్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రాంతంగా నిలబెట్టాయి. అయితే ఇప్పుడు రంగంలో మరో పెద్ద మార్పు రానుందనే అంచనాలు ఉన్నాయి. గచ్చిబౌలి తరహా అభివృద్ధి తాజాగా డేటా సెంటర్లు నిర్మితమవుతున్న ప్రాంతాల్లో కనిపించబోతుందని నిపుణుల అభిప్రాయం.అమెజాన్ ఇప్పటికే సుమారు రూ. 36,000 కోట్ల పెట్టుబడితో భారీ డేటా సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టగా, భవిష్యత్తులో మరో రూ. 60,000 కోట్ల పెట్టుబడితో విస్తరణకు సిద్ధమవుతోంది. ఈ డేటా సెంటర్ ప్రాజెక్టులు అభివృద్ధిని తీసుకురాబోయే ముఖ్య ప్రాంతాలు ఇవి:

1. కందుకూరు ు మీర్‌ఖాన్‌పేట (రంగారెడ్డి జిల్లా)

సుమారు 48 ఎకరాల్లో AWS డేటా సెంటర్ నిర్మాణం కొనసాగుతోంది. ఫార్మాసిటీకి సమీపంలో ఉండటం, భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు ఉండటం వల్ల ఇక్కడ భూముల విలువ భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

2. షాబాద్ చందనవెల్లి (రంగారెడ్డి జిల్లా)

చందనవెల్లి కూడా డేటా సెంటర్ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. AWS తో పాటు మైక్రోసాఫ్ట్ కూడా ఇక్కడ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం రియల్ ఎస్టేట్ రేట్లను గణనీయంగా పెంచే అవకాశం ఉంది. త్వరలోనే ఇది భారీ ఐటి-డేటా ఇన్‌ఫ్రా జోన్‌గా మారనుంది.

3. రావిర్యాల (ఫ్యాబ్ సిటీ సమీపంలో)

ఫ్యాబ్ సిటీకి సమీపంలో ఉండటం వల్ల రావిర్యాల ప్రాంతం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. AWS డేటా సెంటర్ నిర్మాణం ఇక్కడ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను మరింత ఉత్సాహపరుస్తోంది. రాబోయే సంవత్సరాల్లో ఇది సౌకర్యాలు, కనెక్టివిటీతో కూడిన ప్రధాన హబ్‌గా మారే అవకాశం ఉంది. డేటా సెంటర్ ప్రాజెక్టుల పెరుగుదలతో ఈ ప్రాంతాలు రాబోయే కాలంలో గచ్చిబౌలి తరహా మార్పును చూసే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ప్రశాంత వాతావరణంలో సర్పంచ ఎన్నికలు

జగిత్యాల,ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. అధికారుల సూచనలు పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ బీఎస్.లత తెలిపారు. మొదటి విడత మెట్‌పల్లి మండలంలో జరిగే సర్పంచ్ ఎన్నికల ఎన్నికల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పోలీస్ బృందాలను నియమించినట్లు, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను బిగించినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

# మళ్ళీ మొదలెడతానంటున్న కొడాలి నాని



హైదరాబాద్,తన వ్యక్తిగత జీవితంలో ఇబ్బందుల వల్లనే తాను ప్రత్యక్ష రాజకీయాలకు కొంత దూరంగా ఉండాల్సి వచ్చిందని వైసీపీకి చెందిన ఫైర్ బ్రాండ్ లీడర్, మాజీ మంత్రి కొడాలి నాని చెబుతున్నారు. ఇది జస్ట్ గ్యాప్ మాత్రమే అని ఆయన అంటున్నారు. తాను తొందరలోనే పూర్తిగా రాజకీయాల్లోకి వచ్చి జనంతో మమేకం అవుతాను అని ఆయన చెప్పారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆ సంతకాల పత్రాలు జిల్లా కార్యాలయానికి తరలించే ప్రోగ్రాం లో బుధవారం కొడాలి నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తన ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ ప్లాన్ వెల్లడించారు.

హెల్త్ ఇష్యూస్ తోనే :

తనకు బైపాస్ సర్జరీ జరిగిందని అందువల్ల కొన్నాళ్ళ పాటు రెస్ట్ తీసుకున్నాను అని చెప్పారు తొందరలోనే తాను జనంలోకి వస్తాను అని చెప్పారు. అంతే కాదు ప్రజా ఉద్యమాలలో పాల్గొంటాను అని ఆయన వివరించారు. తాను ప్రజా ఉద్యమాలలో సైతం పాలు పంచుకుంటాను అని కొడాలి నాని చెప్పారు. ఇక తన శక్తివంచన లేకుండా పనిచేస్తాను అని జగన్ మళ్ళీ ఏపీకి సీఎం కావడానికి తాను చేయాల్సింది అంతా చేస్తాను అని చెప్పారు. ప్రభుత్వంలో జరిగ్తే అవకతవకల మీద తాము ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు.

గేర్ మార్చినట్లేనా :

కొడాలి నాని అంటే ఫైర్ బ్రాండ్ గా ఉంటూ టీడీపీ మీద పవన్ మీద పెద్ద ఎత్తున విమర్శలు చేసేవారు. ఆయన మంత్రిగా ఉండగా ఒక రేంజిలో ప్రత్యర్థి పార్టీల మీద విరుచుకుని పడేవారు. అయితే వాటి వల్లనే చివరికి వైసీపీకి ఇబ్బంది వచ్చింది అని అంతా విశ్లేషించారు. జనాలు విమర్శలను అయితే స్వీకరిస్తారు కానీ హద్దులు దాటి వ్యక్తిగత విమర్శలు చేస్తే మాత్రం సహించలేకపోయారు అని కూడా విశ్లేషణలు ఉన్నాయి. ఇక వైసీపీ 2024 ఎన్నికల్లో దారుణ పరాజయం పొందింది. దాంతో పాటుగా చాలా మంది నాయకులు సైతం తెర మరుగు అయ్యారు. ఆ జాబితాలో కొడాలి నాని కూడా ఉన్నారు. నిజానికి కొడాలి నాని అంటే జగన్ కి అత్యంత సన్నిహితులు అని పేరు ఉంది. కానీ ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక నాని మౌనమే తన భాషగా చేసుకున్నారు. పైగా ఆయన ఎక్కడా గుడివాడలో సైతం కనిపించలేదు. హైదరాబాద్ లో ఉన్నారని కూడా ప్రచారం సాగింది.

అరెస్టు వార్తలు :

ఇంకో వైపు చూస్తే వల్లభనేని వంశీ తరువాత అరెస్ట్ కొడాలి నానిది అని కూడా ఒక దశలో ప్రచారం సాగింది. కానీ జరిగింది వేరుగా ఉంది. నాని అరెస్టు అదిగో ఇదిగో అంటూండగానే ఏణ్ణర్థం కాలం ఇట్టే గడచిపోయింది. మరో వైపు చూస్తే నానికి ఆరోగ్యపరంగా సమస్యలు కూడా వచ్చాయి. ఆయనకు బైపాస్ సర్జరీ జరగడంతో చాలా కాలం రెస్ట్ తీసుకున్నారు. అయితే గుడివాడలో చూస్తే కూటమి జోరు చేస్తూ పోతోంది. కొడాలి నాని లేకపోవడంతో వైసీపీ క్యాడర్ అంతా నీరసించి పోయింది. ఇంకో వైపు చూస్తే చాలా మంది నాని అనుచరుల మీద కేసులు పడ్డాయని కూడా చెబుతున్నారు. దాంతో వరసగా నాలుగు సార్లు గెలిచి కంచుకోటగా గుడివాడను చేసుకున్న నాని సొంత నియోజకవర్గం ఒక విధంగా నాయకుడు లేనిదిగా మారింది.

వైసీపీ అలెర్ట్ తో :

ఇక చూస్తే వైసీపీ అధినాయకత్వం కూడా గుడివాడలో ఆల్టర్నేషన్ కోసం ప్రయత్నిస్తోంది అన్న వార్తలు కూడా ఒక దశలో వినిపించాయి నాని కనుక ఇనాక్టివ్ గా ఉంటే అక్కడ కొత్త వారికి చాన్స్ ఇవ్వాలని కూడా హైకమాండ్ సీరియస్ గానే ఆలోచించింది అని కూడా చెప్పుకున్నారు. అంతే కాదు కొడాలి నానిని పిలిచి మరీ ఈ విషయం చెప్పి యాక్టివ్ కావాలని కోరారని ప్రచారం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో నాని జనంలోకి వస్తాను అని చెప్పడం అంటే ఒక విధంగా వైసీపీకి శుభ వార్తను వినిపించినట్లే అని అంటున్నారు. అయితే నాని హెల్తీగా ఉన్నాను జనంలోకి వస్తాను అంటే మళ్లీ ఆయన మీద అరెస్టులు కేసులు ఉంటాయా ఉండవా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా కొడాలి మళ్ళీ మొదలెడతానని అంటున్నారు. అది వైసీపీకి ఏ మేరకు ప్లస్ అవుతుంది అన్నది చూడాల్సి ఉంది.

# వైసీపీది పేరాశ... రెడీ కావాల్సిందే !



అమరావతి,రాజకీయాల్లో ఎన్నో జరుగుతాయి. అన్ని చోట్లా జరుగుతాయి. కానీ ఏపీ రాజకీయమే సెపరేట్ గా సాగుతుంది. ఇక్కడ అంతా ఒక ప్రత్యేకంగా చూడాలి. ఓటర్లు అలాగే విలక్షణమైన తీర్పులు ఇస్తూంటారు. రాజకీయ పార్టీలు నాయకులు అలాగే కొత్తగా ఆలోచిస్తూంటారు అందుకే దేశంలోనే ఏపీ ఒక స్పెషల్ అని చెప్పాలి. దేశమంతా ఇదిరాగాంధీని ఓడిస్తే ఏపీ జనాలు నెత్తిన పెట్టుకున్నారు. అదే దేశమంతా రాజీవ్ గాంధీని ఆయన కాంగ్రెస్ ని గెలిపిస్తే ఏపీలో టీడీపీని గెలిపించారు జనం. ఇక ఏపీలోని రాజకీయ పార్టీలు జాతీయంగా తీసుకునే వైఖరులు కూడా మరో ప్రత్యేకం. ఎక్కడా లేని విధంగా అధికార విపక్షాలు రెండూ కూడా ఎన్డీయే నిలబెట్టే రాష్ట్రపతి ఉప రాష్ట్రపతులకు ఓటేస్తూంటారు.

కూటమి బీటలు అంటూ :

ఇక అసలు విషయానికి వస్తే దేశంలో అన్ని చోట్లా పొత్తులు ఉంటాయి. అవన్నీ ఎన్నికల వరకే అన్నట్లుగా ఉంటాయి. ఒక్కసారి అధికారంలోకి రాగానే ఆ పొత్తులు చిత్తు అవుతూ ఉంటాయి. కానీ ఏపీలో మాత్రం పొత్తు సెపరేట్ ట్రాక్ లో నడుస్తోంది 2019 చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కూటమిలోని మూడు పార్టీలు ఇక పైన విడిపోకూడదని ఒట్టేసుకుని ముందుకు సాగుతున్నాయి. అంతే కాదు మరో పదిహేనేళ్ల పాటు ఏపీలో కూటమి అధికారంలో ఉండాలని కూడా గట్టిగా కోరుతున్నాయి. అలా టీడీపీ జనసేన బీజేపీ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయి. కూటమిలో విభేదాలు వస్తాయని పొత్తు చిత్తు అవుతుందని భావించిన వైసీపీకి అయితే ఈ పరిణామాలు అసలు మింగుడు పడడం లేదు అని అంటున్నారు.

పదిహేను ఇచ్చిన సందేశం :

వైసీపీ ఇంకా 2014 నుంచి 2019 మధ్యనే తన రాజకీయ వ్యూహాలతో ఉండిపోయింది. ఆనాడు కూడా మూడు పార్టీలు కలసి అధికారంలోకి వచ్చాయి. కానీ ముందు జనసేన విడిపోయింది. ఆ తరువాత బీజేపీ నుంచి టీడీపీ వేరు పడింది. అలా 2019లో బంగారు పళ్ళెంలో అధికారాన్ని వైసీపీ చేతిలో పెట్టడానికి ఈ విభేదాలు కలసి వచ్చాయని అంటున్నారు. అలాంటి పరిస్థితి మళ్ళీ 2024 నుంచి 2029 మధ్యలో వస్తుందని వైసీపీ ఊహిస్తోంది. దాని కోసం చేయాల్సింది అంతా చేస్తోంది. కానీ ఎక్కడా వర్కౌట్ కావడం లేదు అని అంటున్నారు. సోషల్ మీడియాలో వైసీపీ అభిమానులు అయితే కూటమి పార్టీల మధ్య సఖ్యత లేదని గ్రౌండ్ లెవెల్ లో అంతా బాలేదని ప్రచారం అయితే చేస్తున్నారు. కానీ చంద్రబాబుజ్ పవన్ అలాగే బీజేపీ పెద్దలు అంతా ఒక్కటిగా ఉంటూ కూటమి ప్రభుత్వం పదిహేనేళ్ల పాటు ఏపీలో ఉండాల్సిన ఆవశ్యకతను అయితే తెలియచేస్తున్నారు. దాంతో మెజారిటీ నేతల మైండ్ సెట్ అయితే ఈ విధంగా మార్చగలుస్తున్నారు అని అంటున్నారు.

టఫ్ టాస్క్ గానే :

అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ళకు పైగా వ్యవధి ఉంది కాబట్టి కూటమిలో బీటలు చూడవచ్చు అన్న ఆశ అయితే వైసీపీలో ఎక్కడో ఉంది. కానీ చూస్తూంటే అదేమీ జరిగేది కాదని కూడా తేలుతోంది. ఈ క్రమంలో కూటమిగా మూడు పార్టీలు 2029 ఎన్నికల్లో వస్తే కనుక వైసీపీకి ఫైట్ అంత ఈజీ కాదని అంటున్నారు. సర్వ శక్తులూ ఒడ్డాల్సిందే అని అంటున్నారు. అంత చేసినా ఫలితం మాత్రం సానుకూలంగా వస్తుందన్న ధీమా అయితే ఉంటుందా అన్న సందేహాలూ ఉన్నాయి. ఏది ఏమైనా వైసీపీ అయితే ఒంటరి పోరుకు రెడీ కావాల్సిందే అదే సమయంలో బలంగా ఉన్న కూటమినే ఎదుర్కోవడానికి ప్రిపేర్ కావాల్సిందే అని అంటున్నారు.

# తెలంగాణలో మరో పరువు హత్య.. మాట్లాడదాం రమ్మని మర్డర్!



సంగారెడ్డి :ప్రేమ వ్యవహారం ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. కూతురిని ప్రేమిస్తున్నాడనే నెపంతో పెళ్లి విషయం మాట్లాడుకుందామని ఇంటికి పిలిపించిన అమ్మాయి తల్లిదండ్రులు..ఏకంగా ఆ యువకుడిని హత్య చేయడం స్థానికంగా కలకలం రేపింది. ఈ దారుణ సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడ సృజన లక్ష్మీ నగర్లో జరిగింది. మృతుడు జ్యోతి శ్రావణ్ సాయి అలియాస్ శివ (20)గా గుర్తింపు. అతడి స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్లో రూమ్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు.స్టూడెంట్స్ పార్టీల ఉచ్చులో పడొద్దు.. ఓయూలో రేవంత్ సంచలన స్పీచ్!బీరంగూడ సృజన లక్ష్మీ నగర్కు చెందిన శ్రీజ (19), శ్రావణ్ సాయి (శివ) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ పదవ తరగతి వరకు ఒకే దగ్గర చదువుకున్నారు. ఆ తర్వాత వేర్వేరుగా విద్యనభ్యసిస్తున్నప్పటికీ.. వీరి ప్రేమబంధం కొనసాగింది. ఈ ప్రేమ వ్యవహారం గురించి తెలుసుకున్న శ్రీజ కుటుంబ సభ్యులు, పలుమార్లు వారిని హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆగ్రహంతో ఉన్నారు. ప్రేమికులు ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో.. అమ్మాయి కుటుంబ సభ్యులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పెళ్లి విషయం మాట్లాడుకుందామని చెప్పి శ్రావణ్ సాయిని బీరంగూడలోని తమ ఇంటికి పిలిపించారు. యువకుడు వారి ఇంటికి చేరుకోగానే.. మాట్లాడుకునే నెపంతో లోపలికి రప్పించి.. ఒక్కసారిగా అమ్మాయి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కలిసి అతనిపై దారుణంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రావణ్ సాయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

అమీన్పూర్ పోలీసుల దర్యాప్తు:

హత్య సమాచారం అందుకున్న అమీన్పూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పెళ్లి విషయం మాట్లాడదామని పిలిపించి హత్య చేయడం అనేది.. ఇది ముందుగా పథకం ప్రకారం చేసిన హత్య గా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే అమ్మాయి తల్లిదండ్రులతోపాటు ఈ దాడిలో పాల్గొన్న ఇతర కుటుంబ సభ్యుల కోసం పోలీసులు గాలిస్తున్నారు లేదా వారిని అదుపులోకి తీసుకునే ప్రక్రియలో ఉన్నారు. ప్రేమను వ్యతిరేకించడానికి గల కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పరువు హత్య:

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారాల విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లల నిర్ణయాలను వ్యతిరేకించి.. పరువు కోసమని యువతీ యువకులను హత్య చేసే సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరువు హత్యల విషయంలో చట్టం కఠినంగా ఉన్నప్పటికీ.. సామాజికంగా, సాంస్కృతికంగా పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలం, కుల వ్యవస్థ ప్రభావం ఇలాంటి దారుణాలకు దారితీస్తోంది. ప్రేమ వివాహాల విషయంలో యువతీ యువకులకు రక్షణ కల్పించేందుకు.. అలాగే ఆనర్ కిల్లింగ్ కేసులలో నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా న్యాయ వ్యవస్థ తరచుగా జోక్యం చేసుకుంటున్నా.. అసాంఘిక శక్తులు ఇలాంటి నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఈ తాజా సంఘటన ప్రేమ వివాహాల విషయంలో తల్లిదండ్రులు ఆలోచనా ధోరణిలో మార్పు ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసింది. యువత ప్రేమను గౌరవించి, సామాజిక న్యాయానికి, స్వేచ్ఛకు విలువ ఇవ్వాలని అధికారుల సైతం అనేక వేదికల మీద ఇటీవల ప్రస్తావించిన నేపథ్యంలో ఈ హత్య మరింత చర్చనీయాంశంగా మారింది.

# బోరుగడ్డతో భలే తమాషా.. ఉలిక్కిపడిన వైసీపీ!



అమరావతి,గుంటూరుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడిగా చెప్పుకునే బోరుగడ్డ అనిల్ కుమారుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రకటించింది. అధికారంలో ఉండగా బోరుగడ్డ సోషల్ మీడియా ఇంటర్వ్యూలు, అతడి ప్రవర్తన పట్ల మౌనం వహించిన వైసీపీ పార్టీ.. తాజాగా అతడు ఓ యూట్యూబ్ చానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూతో ఉలిక్కిపడింది. బోరుగడ్డ మాటలను తేలిగ్గా వదిలేస్తే పార్టీకి తీవ్ర నష్టం తప్పదన్న భావనకు వచ్చిన వైసీపీ.. అతడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గురువారం సాయంత్రం ప్రకటించింది. అయితే వైసీపీ ప్రకటన చేయడానికి దారి తీసిన పరిస్థితులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.వైసీపీ అధికారంలో ఉండగా, తాను ఆ పార్టీకి సానుభూతిపరుడిగా బోరుగడ్డ అనిల్ కుమార్ చెప్పుకునేవాడు. రిపబ్లికన్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో, కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే శిష్యుడిగా చెప్పుకుంటూ బోరుగడ్డ రాష్ట్రంలో అనేక వ్యవహారాలు చేశాడు. అయితే అన్నింటికంటే ఎక్కువగా మాజీ సీఎం జగన్ వీరాభిమాని అనే ట్యాగ్ లైన్ తో సోషల్ మీడియాలో రెచ్చిపోయేవాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి ఫోన్ చేసి తన అభిమాన నేత జగన్ ను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు. అయితే బోరుగడ్డ అలా రెచ్చిపోయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎన్నికల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టం ఎదురైందనే విశ్లేషణలు ఉన్నాయి.ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డను అరెస్టు చేశారు. దాదాపు ఏడు నెలలు జైలులో పెట్టారు. రాష్ట్రంలో దాదాపు 50 కేసలు నమోదు చేయడమే కాకుండా, రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు తిప్పుతూ బోరుగడ్డకు తగిన ట్రీట్మెంట్ ఇచ్చారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆయనపై ఇంత కఠినంగా వ్యవహరించినా ఎవరూ సానుభూతి కూడా చూపలేదు. వైసీపీ నేతలు కూడా అతడికి విధించిన శిక్షపై లోలోన ఆనందించారని అంటున్నారు. తమ ప్రభుత్వం చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసిందని పార్టీ అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానించేవారని అంటున్నారు. బోరుగడ్డ వంటి వారి వల్లే ప్రజల్లో వైసీపీపై దురాభిప్రాయం ఏర్పడిందని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో బోరుగడ్డ ఏడు నెలలు జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చారు. తన మకం గుంటూరు నుంచి హైదరాబాద్ కు తాత్కాలికంగా మార్చారు.జైలు నుంచి విడుదలైన తర్వాత బోరుగడ్డ చాలాకాలం సైలెంటుగానే ఉన్నాడు. అయితే కొన్ని యూట్యూబ్ చానళ్లు మళ్లీ అతడిని ఇంటర్వ్యూలు చేయడంతో తాను మాజీ సీఎం జగన్ శిష్యుడినంటూ చెప్పుకోవడం ప్రారంభించాడు. అంతేకాకుండా తనకు పార్టీకి సంబంధం లేదంటూ చెబుతున్న నేతలపై తీవ్ర పదజాలంతో దూషణలు మొదలుపెట్టాడు. తనకు జగన్ అండగా నిలిచారని, ఆయనే బెయిలు ఇప్పించారని కూడా బోరుగడ్డ ఇంటర్వ్యూల్లో చెబుతున్నాడు. తాను ఇన్నాళ్లు రిపబ్లికన్ పార్టీలో కొనసాగానని, ఇప్పుడు ఆ పార్టీకి రాజీనామా చేశానని, త్వరలో జగన్ సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరుతానని కూడా చెప్పాడు. దీంతో వైసీపీ ఉలిక్కిపడింది.బోరుగడ్డ మాటలను గతంలో మాదిరిగా ఉపేక్షిస్తే పార్టీకి చెడ్డపేరు ఖాయమన్న భావనతో వెనువెంటనే స్పందించింది. బోరుగడ్డ ఇంటర్వ్యూ యూట్యూబ్ లో దర్శనమిచ్చిన గంటల వ్యవధిలోనే అతడితో పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేసింది.

# మోడీ వెళ్ళేది అందుకే ...బీజేపీ కాంగ్రెస్ ల మధ్య డైలాగ్ వార్

న్యూఢిల్లీ,దేశంలో మోడీ ప్రధానిగా గత పదకొండేళ్లుగా పాలన సాగిస్తున్నారు. ఆయన మూడు సార్లు ఈ దేశానికి వరసగా నాయకత్వం వహిస్తున్నారు. ఇక మోడీ గురించి చెప్పుకోవాలంటే ఎక్కువగా ఆయన తన హయాంలో విదేశీ పర్యటనలు చేపట్టారు. ఇప్పటికీ ఆయన విదేశీ టూర్లు ఉంటున్నాయి. ఈ దేశంలో మరే ప్రధాని చేపట్టని విధంగా మోడీ విదేశీ పర్యటనకు ఉన్నాయన్నది అంతా అంటారు. అయితే ఇదే విషయం మీద కాంగ్రెస్ మోడీని గట్టిగానే టార్గెట్ చేస్తోంది. మోడీ విదేశీ పర్యటనలు ఎక్కువగా చేస్తారు అంటూ సెటైర్లు వేసింది. అయితే దానికి బీజేపీ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.

మోడీ విదేశీ టూర్లు. :

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనకు సంబంధించి కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా విమర్శించింది. మోడీ పర్యటనకు దేశం కోసం ఉంటాయని ఆయన దేశ హితం కోసమే విదేశీ పర్యటనలు పెట్టుకుంటారు అని బిజెపి అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది స్పష్టం చేశారు. అంత కాదు కాంగ్రెస్ పార్టీ మోడీ మీద చేసిన వ్యాఖ్యలను అంతా ఖండించాల్సిందే అని అంటున్నారు. నరేంద్ర మోడీ ప్రధాని హోదాలో అధికారిక పర్యటనలు చేస్తున్నారు అని ఆయన అన్నారు. ఇక దేశం పని కోసం మోడీ విదేశాలకు వెళతారని అన్నారు.

రాహుల్ దేనికో :

అదే సమయంలో బీజేపీ అసలు ఊరుకోలేదు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ ప్రతి పార్లమెంట్ సమావేశం తర్వాత విదేశాలకు ఎందుకు వెళ్తున్నారు అని సుధాంశు త్రివేది నిలదీశారు. రాహుల్ తన సెలవుల కోసం విదేశాలకు వెళతారని ఆయన ఎద్దేవా చేశారు. అలా రాహుల్ గాంధీ విలాసాల కోసం విదేశాలకు వెళ్తున్నారు



అని మోడీ దేశ హితం కోసం టూర్లు వేస్తున్నారు అని బీజేపీ తేడా చూపించి మరీ వివరించే ప్రయత్నం చేసింది అన్న మాట.

తేడా తెలుసుకోండి :

మోడీని విమర్శించే ముందు దేశంలో ఏమి జరుగుతోంది అన్నది కాంగ్రెస్ గ్రహించాలని సుధాంశు త్రివేది కోరారు. అంతే కాదు మోడీ ఏమి చేసినా ప్రభుత్వం కోసం ప్రజల కోసమే అని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఇక దేశంలో చూస్తే చాలా కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి విధి నిర్వహణలో ప్రధాని విదేశీ పర్యటనకు వెళ్ళడం అలాగే సెలవులలో రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్ళడం మధ్య తేడా తెలియదా అని ప్రశ్నించారు. మోడీ దేశ ప్రతిష్ట పెంచుతూంటే రాహుల్ తన విదేశీ పర్యటనల ద్వారా దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. మొత్తానికి చూస్తే మోడీ విదేశీ టూర్లు రాహుల్ టూర్లు కూడా కాంగ్రెస్ బీజేపీల మధ్య డైలాగ్ వార్ కి కారణంగా మారిపోయాయి అన్న మాట అని అంతా అంటున్నారు.

# పవన్ సార్.. ఇదీ మీ బాధ్యతే.. ఇంకా ఆర్నెల్లే టైము!



అమరావతి,ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన పరిధిలో శాఖలపై స్పష్టమైన ముద్ర వేస్తున్నారు. పంచాయతీరాజ్, అటవీ శాఖలను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఆయా శాఖల్లో వినూత్న కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. ఆ మధ్య శేషాచలం అడవుల్లో కాలిబాటన రెండు కిలోమీటర్లు నడిచి ఎర్రచందనం చెట్ల అక్రమ నరికివేతను అడ్డుకునే యాక్షన్ ప్లాన్ ను రెడీ చేశారు డిప్యూటీ సీఎం. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పల్లెపండుగ, పశువుల హాస్టళు వంటి కార్యక్రమాలతో అభివృద్ధి పరుగులు తీయిస్తున్నారు. తాజాగా పల్లె పండుగ-2.0 ను ప్రారంభించారు. అదే సమయంలో ఎప్పటి నుంచో పంచాయతీరాజ్ అధికారులు డిమాండ్ చేస్తున్న పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి కొత్తగా డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ పోస్టులను సృష్టించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో మినీ కలెక్టరేట్ల మాదిరిగా డీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. అయితే ఇలా తన పనితీరుతో పంచాయతీరాజ్ శాఖను పరుగులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ ఓ ముఖ్యమైన పనిని విస్మరించారని అంటున్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాల పునర్విభజనపై ప్రభుత్వం దృష్టి సారించింది. విభజన సమయంలో 13గా ఉన్న జిల్లాలను గత వైసీపీ ప్రభుత్వం 26కు పెంచింది. ప్రతిపార్లమెంటు నియోజకవర్గానికి ఒక జిల్లా చొప్పున కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభుత్వం అరకు పార్లమెంటును రెండు జిల్లాలుగా విభజించడంతో 25 పార్లమెంటు నియోజకవర్గాలు 26 జిల్లాలు అయ్యాయి. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొత్తగా మరో మూడు జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. త్వరలో జనగణన ప్రారంభం కానున్నందున వీలైనంత త్వరగా కొత్త జిల్లాలను ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో పోలవరం, మదనపల్లె, మర్కాపురం జిల్లాలకు త్వరలో గెజిన్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ఇలా జిల్లాలను విభజిస్తున్న ప్రభుత్వం.. జిల్లా పరిషత్ ల విభజనను విస్మరించడంపైనే ఎక్కువగా చర్చ జరుగుతోంది.జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 26 జిల్లా పరిషత్తులు ఉండాల్సివుంది. అయితే వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 13 ఉమ్మడి జిల్లాలకు 13 జిల్లా పరిషత్తుల ద్వారా పాలనా వ్యవహారాలు సాగిస్తున్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించే జిల్లా పరిషత్తులను విభజించడంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కూడా శీతకన్ను వేసినట్లు చెబుతున్నారు. అయితే జిల్లా పరిషత్ లకు పాలక వర్గాలు ఉండటంతో ప్రస్తుతం విభజన సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. కానీ, మరో ఆరు నెలల్లో జిల్లా పరిషత్తు పాలక వర్గాల పదవీకాలం పూర్తికానుండటంతో ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలనే డిమాండ్ వినిపిస్తోంది.కొత్తగా డీడీవో వ్యవస్థను తీసుకువచ్చిన డిప్యూటీ సీఎం తన శాఖ పరిధిలో జిల్లా పరిషత్ విభజనపై దృష్టి పెట్టాలని నేతలు కోరుతున్నారు. మూడు కొత్త జిల్లాలు ఏర్పాటు ప్రక్రియ పూర్తయిన తర్వాతైనా జిల్లా పరిషత్తులపై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ దృష్టికి ఈ సమస్య రాలేదా? లేక సమయం ఉందని వదిలేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ప్రభుత్వం ముందుగా మేల్కొంటే కొత్త జిల్లాలకు జిల్లా పరిషత్ కార్యాలయాలను సమకూర్చుకోవడం అవుతుందని, లేని పక్షంలో కలెక్టరేట్ల వలే అద్దె భవనాలలో కొనసాగాల్సివస్తుందని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ తలచుకుంటే జిల్లా పరిషత్తుల విభజన వెంటనే మొదలయ్యే చాన్స్ ఉందని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com